క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌గా బేబి



నందికొట్కూరు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నూతన కమిషనర్ బేబి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. పూలమాలలు వేసి సత్కరించారు. ఆమె మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, ఉద్యోగుల సహకారంతో పట్టణాభివృద్ధి చేస్తానన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ఆత్మకూరు పట్టణ సీఐగా ఓబులేసు



ఆత్మకూరు: పట్టణ సీఐగా ఓబులేసు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, మధ్యవర్తులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు.

అధిక ధరకు విక్రయిస్తే చర్యలు



మన గ్రోమోర్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ పీరునాయక్

మిడుతూరు: ఎరువులు, రసాయన మందులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏఓ పీరునాయక్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని మన గ్రోమోర్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ పాస్ యంత్రముల ద్వారానే ఎరువులను విక్రయించాలని, ఆధార్ నమోదు చేయకుండా ఎరువుల అమ్మకాలు చేపట్టొద్దని ఆదేశించారు. ఎరువుల, రసాయన మందుల ధరల పట్టీని నోటీస్ బోర్డులో కనిపించేలా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ అశోక్, మన గ్రోమోర్ సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



సంప్రదాయ నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై సికింద్రాబాద్‌కు చెందిన వెంకటేశ్వర నృత్యనికేతన్ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో మూషికవాహన, శివతాండవం, ఓం నమః శివాయ, అఖిలాండేశ్వరి, దేవీస్తుతి తదితర గీతాలకు లాస్య, గౌతమి, వేదశ్రీ, భవిష్య, సహస్ర, నిత్యశ్రీ, సంయుక్త, సమీక్ష, సాహితి, శ్రీవర్షిణి నృత్యం ప్రదర్శించారు.

సాక్షిగణపతి, వీరభద్రస్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో సాక్షిగణపతి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షిగణపతి స్వామికి పంచామృతాలు, ఫలోదకాలు, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలాలతో అభిషేకం చేసి విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలు చేపట్టారు. అలాగే జ్వాలా వీరభద్రస్వామి వారికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

చెట్లను నరికేస్తున్నారు!



గణేష్ పార్కు ఎదురుగా ఫుట్‌పాత్‌పై ఉన్న చెట్లను నరుకుతున్న దృశ్యం

శ్రీశైలం: క్షేత్ర పరిధిలో పెరిగిన చెట్లను నరికేస్తున్నారు. ఫుట్‌పాత్‌పై ఉన్న చెట్లు ఏపుగా పెరిగాయని, మొత్తం చెట్లను నరకకుండా కొమ్మలను మాత్రమే నరుకుతున్నట్లు ఉద్యాన శాఖ వారు పేర్కొంటున్నారు. పెరిగిన చెట్ల కింద యాత్రికులు, సాధువులు సేద తీరుతున్నారు. విస్తరించిన చెట్ల శాఖలను నరికివేస్తే బాగుంటుందని, అలా కాకుండా మొత్తంగా కొట్టేయడం సరికాదని భక్తులు అభిప్రాయ పడుతున్నారు.

ఇంటిపై కూలిన వృక్షం



వెలుగోడు: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పట్టణ సమీపంలో ఉన్న గట్టు తండాలో ఓ ఇంటిపై వృక్షం కూలింది. తండాకు చెందిన కోడావత్ సేవ నాయక్, సక్రు నాయకుల ఇంటిపై చెట్టు పడడంతో నిత్యావసర వస్తువులు, ఇల్లు దెబ్బ తినిందని బాధితులు వాపోయారు.

గురుసాక్షాత్ పరబ్రహ్మ..

- ఉత్తమ ఉపాధ్యాయులుగా పలువురు ఎంపిక
- నేడు అవార్డులు అందుకోనున్న గురువులు

మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కూరపాటి లక్ష్మణరావు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. తిమ్మాపురం ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్‌గా లక్ష్మణరావు డిసెంబర్ 2020లో బాధ్యతలు తీసుకున్నారు. పాఠశాలతో పాటు విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ఇటీవల తెలుగు భాషా దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించిన విషయం తెలిసిందే. దీంతో పాటు కిచెన్‌గార్డెన్, వేస్ట్ మేనేజ్‌మెంట్, విద్యార్థులకు ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా వ్యవసాయ పంటలపై అవగాహన కల్పించడం లాంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. పిడుగురాళ్ల మండలం జానపాడు గ్రామానికి చెందిన లక్ష్మణరావు వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. ఎంఏ, బీఈడీతో పాటు పీజీ డిప్లొమా ఇన్ లింగ్విస్టిక్స్‌లో మూడో ర్యాంక్ సాధించారు. బీఈడీ ఇంగ్లిష్ మెథడాలజీలో ఆరోస్థానం, 2018 డీఎస్సీలో రాష్ట్రంలోనే లక్ష్మణరావు ఎనిమిదో స్థానంలో నిలిచారు. సాక్షితో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కుటుంబంలో పుట్టిన నాకు కష్టాల విలువ తెలుసని, విద్య ద్వారా అత్యున్నత స్థాయికి చేరవచ్చన్నారు. వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతల సహకారంతో విద్యార్థులకు ఎప్పటికప్పుడు పోటీ పరీక్షలు నిర్వహిస్తూ వారిలోని ప్రతిభను వెలికి తీస్తున్నట్లు చెప్పారు.



కె.వరప్రసాద్

శ్రీశైలంప్రాజెక్ట్: డాక్టర్.సర్వేపల్లి.రాధాకృష్ణన్ జయంతిన జరిగే ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుడిగా శ్రీశైలం ప్రాజెక్ట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు కొత్తమాసి వరప్రసాద్‌ను జిల్లా అధికారులు ఎంపిక చేశారు. చాగలమర్రి మండలం, మద్దూరు గ్రామానికి చెందిన వరప్రసాద్ 1993 నుంచి ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు.



విద్యార్థులకు బోధిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మణరావు

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా జయమ్మ



నందికొట్కూరు: స్థానిక సంతపేట ఎంపీపీ స్కూల్ ఎస్జీటీ టీచర్ ఎస్.జయమ్మ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెప్టెంబరు 5వ తేదీన నంద్యాల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డును తీసుకోనున్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి చేతుల మీదుగా ఉత్తమ అవార్డు తీసుకోవడం మరవలేని రోజు ఉపాధ్యాయ దినోసత్సవమని జయమ్మ చెప్పారు.

వాడాల ఉపాధ్యాయుడికి అవార్డు



పాములపాడు: మండలంలోని వాడాల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న చిన్నపుల్లయ్య జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయన సొంత ఊరు వెలుగోడు మండలం, అయ్యవారిపల్లె గ్రామం, చిన్నకారు రైతు కుటుంబం. తల్లి దండ్రులు వ్యవసాయ పనులు చేసి తనను చదివించారు. 27 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో పని చేస్తున్నాడు. వెలుగోడు, వేల్పనూరు, నల్లకాల్వ, వాడాల గ్రామాల్లో ఎస్‌జీటీగా పని చేశారు. 2021 డిసెంబర్‌లో వాడాల ఉన్నత పాఠశాలలోనే పదోన్నతి పొంది అక్కడే విధులు నిర్వహిస్తున్నారు.

గురుకుల పాఠశాల పీడీకి ..



జూపాడుబంగ్లా బీఆర్ అంబేడ్కర్ గురుకులం పీడీ విజయభాస్కర్‌రెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఆయన మాట్లాడుతూ.. 22ఏళ్ల సర్వీసులో ప్రస్తుతం జిల్లా అధికారులు నా సేవలను గుర్తించి నన్ను ఉత్తమ జిల్లా ఉపాధ్యాయుడిగా ఎంపికచేయటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఎంఏ, ఎంపీఈడీ, పీజీ డిప్లొమో ఇన్ యోగా విద్యను అభ్యసించిన తాను 2002లో అనంతపురం జిల్లా కళసముద్రంలోని గురుకుల పాఠశాలలో పీఈటీగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో పనిచేశానని, 2018లో తనకు ఫిజికల్ డైరెక్టర్(స్కూల్ అసిస్టెంటుగా పరిగణిస్తారు) గా పదోన్నతి లభించినట్లు తెలిపారు. ప్రస్తుతం జూపాడుబంగ్లా గురుకుల పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్నానన్నారు. నాకివ్వనున్న అవార్డుతో నేను మరింత మెరుగ్గా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత పెరుగుతుందన్నారు.

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

ఉపాధ్యాయుడి పేరు	హోదా	ప్రస్తుతం స్థానం
వెంకటరమణ	హెచ్‌ఎం	జెడ్పీహెచ్‌ఎస్, ఆత్మకూరు
సుబ్బరాయుడు	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీహెచ్‌ఎస్, వేల్పనూరు
దుర్గాబాయి	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీహెచ్‌ఎస్, ఆత్మకూరు
సలీమాబేగం	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీహెచ్‌ఎస్, కడుమూరు
కుసుమకుమారి	స్కూల్ అసిస్టెంట్	బాలికల పాఠశాల, ఆత్మకూరు
చిన్నపుల్లయ్య	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీహెచ్‌ఎస్, వానాల
జయమ్మ	ఎస్‌జీటీ	ఎంపీపీస్కూల్, నందికొట్కూరు
లక్ష్మణరావు	ప్రిన్సిపాల్	ఏపీఎంఎస్, మహానంది
విజయభాస్కరరెడ్డి	స్కూల్ అసిస్టెంట్	జూనియర్ కాలేజ్, జూపాడుబంగ్లా
వరప్రసాద్	స్కూల్ అసిస్టెంట్	ప్రభుత్వ హైస్కూల్, సున్నిపెంట

ఫీల్డ్‌అసిస్టెంటుపై విచారణ

జూపాడుబంగ్లా: ఉపాధిహామీ పథకం జూపాడుబంగ్లా ఫీల్డ్‌అసిస్టెంటుపై బుధవారం చేపట్టిన విచారణ పోలీసు బందోబస్తు మధ్య ఉత్కంఠభరితంగా సాగింది. గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంటు లక్ష్మీదేవి పనులకు వెళ్లని, ఉద్యోగం చేస్తున్న, చనిపోయిన వారికి మస్టర్లు వేసి నిధులు స్వాహా చేశారని గ్రామానికి చెందిన జంగాలపెద్దన్న పీడీ రామచంద్రారెడ్డికి ఫిర్యాదు చేశారు. పీడీ ఆదేశాల మేరకు నందికొట్కూరు ఏపీడీ అన్వరాబేగం, అంబుడ్స్‌మెన్ సురేంద్రకుమార్ బుధవారం జూపాడుబంగ్లా సచివాలయం–2లో విచారణ చేపట్టారు. మొదట్లో విచారణ సాఫీగా సాగినా ఇరువర్గాలకు చెందిన వారు తమ మనుషులను సచివాలయం వద్ద మొహరించటం, ఒకరిని ఒకరు విమర్శించుకోవటంతో ఉద్రిక్తత నెలకొంది. అధికారులు ఎస్‌ఐ లక్ష్మీనారాయణకు సమాచారమివ్వగా.. ఏఎస్‌ఐ మేరీజయంతితో పాటు ముగ్గురు పోలీసు సిబ్బందిని బందోబస్తుగా నియమించారు. అనంతరం ఫిర్యాదులో పేర్కొన్న జాబితా ప్రకారంగా ఒక్కొక్కరిని లోపలికి పిలిచి ఏపీడీ, అంబుడ్స్ మెన్ వారిని విచారించి, వారు తెలిపిన వివరాలను లిఖితపూర్వకంగా రాయించుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నూర్జహాన్, ఏపీఓ గౌరీబాయి, సర్పంచ్ మొట్టిబాలస్వామి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మహానంది: ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని బుధవారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు బండిఆత్మకూరు ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. వెలుగోడుకు చెందిన విజయ్, కుమ్మరి నాగేశ్వరరావు ఆటోలో ఎనిమిది క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించి బండిఆత్మకూరు వద్ద బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

ఎరువుల అమ్మకాలు నిలిపివేత

మహానంది: బుక్కాపురంలోని శ్రీకృష్ణ ఎరువులు, పురుగు మందుల దుకాణంలో సరైన అనుమతులు చూపకపోవడంతో రూ. 6.72 లక్షల విలువ చేసే 24 టన్నుల ఎరువుల అమ్మకాలను నిలిపివేయాలని ఆదేశించామని ఏఓ నాగేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ డీలర్లు తప్పనిసరిగా ఫారం–ఓను జతపరచాలన్నారు. ధరల పట్టికలో ఎప్పటికప్పుడు వివరాలు పొందుపరచాలని సూచించారు. రైతులకు ఇచ్చే బిల్లులపై సంతకాలు తీసుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎరువుల నియంత్రణ చట్టం మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ నాగేశ్వరరరెడ్డి

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

డోన్ రూరల్: మిడుతూరు మండలం కడుమూరు గ్రామానికి చెందిన శివరారెడ్డి(65) స్థానిక రైల్వేస్టేషన్‌లో ప్రమాదవశాత్తూ కాలు జారి రైలు కిందపడి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. మంగళవారం మధ్య రాత్రి యాగంటి నుంచి డోన్ మీదుగా కర్నూలుకు రైలులో బయలుదేరాడు. డోన్‌లో రైలులో నుంచి కాలు జారి కిందపడ్డాడు. ప్యాసింజర్‌లు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకి చేరుకుని డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతుడి వద్ద ఉన్న ఆధార్ కార్డును పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించామని రైల్వే పోలీసులు తెలిపారు.



మృతి చెందిన శివారెడ్డి

పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యత

మహానంది: పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెంగళరెడ్డి పేట గ్రామ సర్పంచ్ పల్లె నాగమణి తెలిపారు. బండిఆత్మకూరు మండలం వెంగళరెడ్డిపేట గ్రామంలో బుధవారం మంచి నీటి ట్యాంకులను శుభ్రం చేసి, క్లోరినేషన్ చేయించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లె సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

నిమజ్జనంలో డీజేలకు అనుమతి లేదు

మహానంది: గణేష్ నిమజ్జనం ఉత్సవాల సందర్భంగా డీజేలకు అనుమతి లేదని బండిఆత్మకూరు ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. బండిఆత్మకూరు పోలీస్‌స్టేషన్ వద్ద బుధవారం సాయంత్రం విగ్రహ ఏర్పాటుదారులు, కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ ఆల్‌ఫ్రెడ్, అధికారులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్‌ఐ మాట్లాడుతూ నిమజ్జనం ఉత్సవాల, ఊరేగింపుల్లో వృద్ధులు, చిన్నపిల్లలు పాల్గొనకుండా చూడాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

ఒకరోజు వేతనం విరాళం

మహానంది: వరద బాధితుల సహాయార్థం మహానంది దేవస్థానం ఉద్యోగులు ఒకరోజు వేతనం రూ.76,662 విరాళంగా ఇవ్వడానికి నిర్ణయించినట్లు ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 11 ప్రధాన దేవాలయాల నుంచి ఉద్యోగులు ఒకరోజు వేతనాన్ని వరద బాధితుల సహాయం కోసం ఇచ్చేందుకు ప్రధాన దేవస్థానాల యూనియన్ అధ్యక్షుడు హరిబాబు నిర్ణయించారన్నారు. అందులో భాగంగా ఇక్కడి నుంచి ఈఓ శ్రీనివాసరెడ్డి ద్వారా దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణకు అందించనున్నట్లు చెప్పారు.

రెండు దుకాణాల్లో చోరీ

మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం గ్రామంలోని రెండు దుకాణాల్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. గ్రామంలోని బస్టాండు వద్ద అచ్చయ్య, సుభాష్ హోటళ్లు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారి హోటళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి చొరబడి గ్యాస్ సిలిండర్లు, పెట్రోలు క్యాన్, వంటనూనె డబ్బాలను ఎత్తుకెళ్లినట్లు బాధితులు వాపోయారు. బాధితులు మహానంది పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సంక్షిప్తం

తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

జూపాడుబంగ్లా: తూకాల్లో మోసాలకు పాల్పడినట్లు తెలిస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ అనిత హెచ్చరించారు. బుధవారం ఆమె నందికొట్కూరు, తంగడంచ, జూపాడుబంగ్లా గ్రామాల్లోని కిరాణం, చికెన్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లోని ఎలక్ట్రానిక్ కాటా యంత్రాలను పరిశీలించి వాటికి సీళ్లు ఉన్నాయా, యంత్రాలకు సంబంధించిన అనుమతి పత్రాలున్నాయా తనిఖీ చేశారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మిడుతూరు: మండల పరిధిలోని కలమందలపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నుంచి 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఓబులేసు తెలిపారు. కలమందలపాడు గ్రామానికి చెందిన చిలకల రాజేష్ ఏపీ మద్యం అక్రమంగా విక్రయిస్తుండగా సమాచారం మేరకు దాడి చేసి ఆతని నుంచి 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

20 మందికి మండల స్థాయి అవార్డులు

నందికొట్కూరు: సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 20 మంది ఉపాధ్యాయులు మండలస్థాయి అవార్డులకు ఎంపికయ్యారని ఇన్‌చార్జ్ ఎంఈఓ సుభాన్ బుధవారం తెలిపారు. ప్రతిభ ఉన్న ఉపాధ్యాయులను గుర్తించి అవార్డులు ప్రదానం చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రతి ఒక్కరూ అవార్డులు దక్కించుకోవాడానికి ప్రతిభ చాటుకోవాలని తెలిపారు.

గణేష్ నిమజ్జనంలో అపశృతుల్లేకుండా చేద్దాం

జూపాడుబంగ్లా: వివిధ శాఖల మండల స్థాయి అధికారులందరూ సమన్వయంతో ఈనెల 9, 11 తేదీల్లో జూపాడుబంగ్లా సమీపంలోని కేసీ కాల్వలో జరిగే గణేష్ నిమజ్జనం వేడుకల్లో ఎలాంటి అపశృతుల్లేకుండా చేసుకుందామని ఎస్‌ఐ లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నూర్జహాన్, సర్పంచ్ మొట్టిబాలయ్య, ఎంపీపీ సువర్ణమ్మ, ఈఓపీఆర్డీ మధుమోహనచక్రవర్తిల అధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లడుతూ ఈనెల 7న వినాయక చవితి వేడుకల అనంతరం 9న జూపాడుబంగ్లా మండలంలోని వివిధ గ్రామాల్లోని వినాయకుని ప్రతిమలను ఆయా గ్రామాల సమీపంలో ఉన్న కేసీ కాల్వలు, చెరువుల్లో నిమజ్జనం చేస్తారని తెలిపారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసుబందోబస్తు నిర్వహిస్తామన్నారు.

కూలిన ఇంటి గోడ

పాములపాడు: మండలంలోని మిట్టకందాల గ్రామ పంచాయతీ మజరా బుద్ధానగర్ గ్రామంలో బుధవారం నరసింహులు అనే వ్యక్తికి చెందిన ఇంటి గోడ పాక్షికంగా కూలింది. రాత్రి నిద్రిస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని, కొత్తగా ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని కోరాడు.

అనుమతులు తప్పనిసరి

కొత్తపల్లి: గ్రామాలలో వినాయక చవితి పర్వదినాన్ని పురష్కరించుకొని గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని ఎస్‌ఐ ఎం.కేశవ తెలిపారు. మండలంలో ఈనెల 7వ తేదీ వినాయక చవితి పండుగ సందర్భంగా విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలంటే మీసేవాలో సింగిల్ విండో సిస్టమ్ ద్వారా ఆన్‌లైన్ చలనాకట్టి, పోలీసు స్టేషన్‌లో అనుమతి పొందాలని తెలిపారు. వినాయక విగ్రహాల వద్ద అల్లర్లు, ఘర్షణలు జరగకుండా అందరూ ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు.

నిందితుడి అరెస్ట్

మహానంది: మండలంలోని గాజులపల్లె ఆర్‌ఎస్ గ్రామంలో ఈ ఏడాది జూన్ 26న జవ్వాజీ దాసు (62) మృతిని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. మృతుడి భార్య సావిత్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేయగా గ్రామానికి చెందిన కోలా మోహన్ హత్య చేసినట్లు తేలిందని మహానంది ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన కోలా మోహన్ అభద్రతా భావంతో జవ్వాజీ దాసుపై వ్యక్తిగత కక్ష పెంచుకున్నాడన్నారు. దీంతో సలికెపారతో తలపై మోదీ హత్య చేసినట్లు ఒప్పుకుని, గోపవరం వీఆర్‌ఓ జయరాముడు వద్ద లొంగిపోయాడన్నారు. నంద్యాల రూరల్ సీఐ శ్రీనివాసులు రెడ్డి అరెస్ట్ చేసినట్లు వివరించారు.

ధరలు తగ్గించాలి

నందికొట్కూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, నాయకులు రఘురాంమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని పటేల్ సెంటర్‌లో ధర్నా చేపట్టారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ కిషోర్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిత్యవసర వస్తువులు బియ్యం, కంది పప్పు, నూనె, కిరాణం సరుకులు, కూరగాయల ధరలు తక్షణమే తగ్గించాలన్నారు. పెట్రోల్, డీజల్ ధరలు పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్యక్రమంలో నాయకులు రజితమ్మ, భాను, సులోచనమ్మ వెంకటేశ్వర్లు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచండి

కొత్తపల్లి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉన్నందున పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ మేరీ సూచించారు. బుధవారం మండలపరిధిలోని లింగాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీని సందర్శించి, కాలనీవాసులకు తగు సూచనలు చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కాలనీల్లో మురుగు నీరు నిల్ల లేకుండా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి ప్రవంతికి సూచించారు.

ముగిసిన శివచతుస్సప్తాహ భజనలు





చండీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, ఆలయ ప్రదక్షిణ చేస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రావణమాసం సందర్భంగా లోక కల్యాణార్థం శ్రీశైల దేవస్థానం నిర్వహించిన శివచతుస్సప్తాహ భజనలు బుధవారం ముగిశాయి. ఉదయం ఆలయ ప్రాంగణంలో చండీశ్వరస్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం చుట్టూ కళాకారులతో కలిసి ప్రదక్షిణ చేసి ప్రత్యేక పూజలు చేసి భజనలను ముగించారు. ఆగస్టు 5 నుంచి ప్రారంభమైన అఖండ భజనలు ఆలయ ప్రాంగణంలోని వీరశిరోమండపంలో శ్రావణమాసమంతా రేయింబవళ్ళు శివపంచాక్షరి నామభజన చేశారు. కర్నూలు నగరానికి చెందిన అయిదు భజన బృందాలు, కర్ణాటకకు చెందిన మూడు భజన బృందాలకు భజనలు చేయడానికి అవకాశం కల్పించారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

నందికొట్కూరు: మండల పరిధిలోని అల్లూరు గ్రామ సమీపంలో కేసీ కెనాల్ వెంట బైక్‌పై తెలంగాణ మద్యం తీసుకెళ్తున్న ఈడిగ భాస్కర్ గౌడ్ అదుపులోకి తీసుకొని, 30 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు బ్రాహ్మణకొట్కూరు ఎస్‌ఐ తిరుపాలు తెలిపారు. బుధవారం బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్‌లో పట్టుబడిన నిందితుడు, 30 తెలంగాణ మద్యం బాటిళ్లను విలేకరులకు చూపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తెలంగాణ మద్యం విక్రయిస్తే క్రిమినల్ తప్పవని హెచ్చరించారు.



పట్టుబడిన మద్యం చూపుతున్న ఎస్‌ఐ తిరుపాలు

స్పిల్‌వే ద్వారా నీటి విడుదల

వెలుగోడు: తెలుగు గంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ స్పిల్ వే ద్వారా రెండు గేట్లు ఎత్తి 6వేల క్యూసెక్కుల నీటిని గాలేరుకు విడుదల చేసినట్లు ఏఈ శివ నాయక్ బుధవారం తెలిపారు. భానుక్యచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింకు చానల్ ద్వారా 11,500 క్యూసెక్కులు కృష్ణా జలాలు వచ్చి చేరుతున్నాయి. వీబీఆర్ పూర్తిస్థాయి నీటిమట్టం 16.95 టీఎంసీలు కాగా ప్రస్తుతం 14.774 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అలాగే మద్రాసు కాలువకు 5వేలు, వన్ ఆర్ తూముకు 10 క్యూసెక్కులు, నంద్యాల తాగునీటి అవసరాలకు 10 క్యూసెక్కులు నీటి విడుదల చేస్తున్నామని ఏఈ వివరించారు.